# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 183 | విశాఖపట్నం | 4-4-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 183 | VISAKHAPATNAM | 4-4-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram






2లో

### దేశ వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడేను జరుపుకున్న క్రైస్తవులు



2లో

### 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: రేవంత్ రెడ్డి




6లో

### మీ పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారా?

## అమరావతిని నాశనం చేయాలని చూస్తే

# మేం శాసనం చేశాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** దేవతల రాజధాని పేరైన అమరావతిని పలకడం ఇష్టం లేకే మావిగన్ అనే పేరు జగన్ తెరపైకి తెచ్చారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. హిందూమతంపై ద్వేషంతో తిరుమల శ్రీవారికి అపచారం తలపెట్టిన వారు అమరావతి పేరు పలకటానికి ఇష్టపడతారా అని ప్రశ్నించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ ఒంటిమిట్టలో శ్రీరామకల్యాణంలో పాల్గొన్న సమయంలో లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందిందని గుర్తుచేశారు. రాజ్యసభలో బిల్లు పాస్ అయిన వేళ పోలవరం డయాఫ్రామ్ వాల్ కూడా పూర్తి అయ్యిందని తెలిపారు. ఆంత జరుగుతున్నా వైఎస్సార్సీపీ నేతలు అహంకారం ప్రదర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందితే ఓర్వలేక పోతున్నారన్నారు. ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని ఏమిటని చంద్రబాబు ప్రశ్నించారు. పార్లమెంటు ఓ చట్టం చేస్తే దానిని అమలు చేయాల్సిన రాజకీయ పార్టీలు నా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామంటే ఎలా అని నిలదీశారు. దేశమంతా ఆంధ్రప్రదేశ్?కు మద్దతు పలికి అమరావతి నిర్మాణం కావాలని, దేశాభివృద్ధికి దోహదం చేయాలని సంఘీభావం తెలియచేశారన్న సీఎం వారందరినీ తప్పుపట్టేలా వైఎస్సార్సీపీ వింత ప్రవర్తన ఉందని విమర్శించారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలియడం లేదని విమర్శించారు. వైఎస్సార్సీపీ తిక్కకు పరిష్కారం ఏమిటో తనకు అర్థం కావట్లేదని ఎద్దేవా చేశారు. ప్లాన్ ఏ మూడు ముక్కలాటైతే, ప్లాన్ బీ మావిగన్ అనే మనస్తత్వం ఎవరికీ అంతుబట్టట్లేదని మండిపడ్డారు. కొందరు సైకో అంటుంటే ఇంకొందరు ఇంకేదో అంటున్నారని దుయ్యబట్టారు. తెలుగుజాతి ఉనికి లేకుండా చేయాలని విషం కక్కటం నీచమని ధ్వజమెత్తారు. చరిత్ర ఎప్పటికీ వారిని క్షమించదన్నారు. 9 నగరాలుగా అమరావతిని నిర్మించాలని ప్రణాళికలు చేశామన్న చంద్రబాబు 4 ఆఫీసు భవనాలు నిర్మించేస్తే రాజధాని అయిపోదని స్పష్టం చేశారు. నెర్వ్ సెంటర్‌గా అమరావతి: విద్య, ఉద్యోగం, విజ్ఞానం లాంటి అంశాలకు నెర్వ్ సెంటర్‌గా అమరావతి మారుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతి అభివృద్ధితోపాటు విశాఖ, తిరుపతి లాంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల (తరువాయి 2వ పేజీలో)

# మాపై వివక్ష చూపారు

### ఉపరాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాజధాని అమరావతి బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని వైసీపీ ఎంపీలు ఆరోపించారు. రాజ్యసభలో తమ పార్టీకి ఏడుగురు ఎంపీలు ఉన్నప్పటికీ, కేవలం 5 నిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారని వారు ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి మాత్రం (తరువాయి 2వ పేజీలో)

### విశాఖలో 'ఐఎన్‌ఎస్ తారగిరి'.. నేవీలోకి లాంఛనంగా

# ప్రవేశపెట్టిన రాజ్‌నాథ్‌సింగ్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్‌ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె. త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌక ను ముంబయిలోని మజగాన్ డాక్ షిబిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు.

### అనకాపల్లి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో

# ముగ్గురు యువకులు మృతి




**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామం జంక్షన్ వద్ద ఎన్.హెచ్ 16 ప్రైవేట్ ట్రావెల్ బస్సు, బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. పురుషోత్తపురం గ్రామంలో పండగను చూసుకొని బంగారు నాని (24), ఇల్లపు గోవిందు (25), బంగారు దుర్గ ప్రసాద్ (16) పల్సర్ బైక్ పై వెళు తూ పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద అర్ధరాత్రి సమయంలో యూ-టర్న్ తీసుకుంటుండగా, అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న ప్రైవేట్ ట్రావెలర్ బస్సు ఎపి 39 డబ్ల్యుఎల్ 0868 బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకి తీవ్రగాయా లయ్యాయి. సమాచారం అందుకున్న జాతీయ రహదారి సిబ్బంది తమ అంబులెన్సులో ఇల్లపు గోవిందు, బంగారు దుర్గ ప్రసాద్‌ను ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గోవిందు చనిపోయాడు. ప్రసాద్ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాలను అనకాపల్లి మార్చురికి తరలించారు. బంగారు నానిని 108 లో తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోవడంతో మృతదేహన్ని యలమంచిలి మార్చురికి తరలించారు. బంగారు దుర్గ ప్రసాద్ తండ్రి బంగారు శ్రీను (తరువాయి 2వ పేజీలో)

### విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో వ్యత్యాసాలు..




చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. టీవీకే పార్టీ చీఫ్ విజయ్ సైతం తన నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన.. పెరంబూర్, తిరుచురాపల్లి ఈస్ట్ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగారు. ఈ రెండు స్థానాల్లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో వివరాలు వేర్వేరుగా ఉన్నాయని అధికా రులు వెల్లడించారు. పెరంబూర్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని విజయ్ స్పష్టం చేశారు. తిరుచురాపల్లి ఈస్ట్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు విజయ్ వివరించారని తెలిపారు. 2025లో పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై నమోదైన కేసును పెరంబూర్ ఫైలింగ్‌లో ఆయన వెల్లడించలేదు.

## సిగ్గుతో తలదించుకునేలా

# గురుకుల పాఠశాల పరిస్థితి





- సౌకర్యం లేక విద్యార్థులతో ఆడుకుంటున్న అధికారులపై మాజీ మంత్రి ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

**సింహాచలం, పతాకం న్యూస్:** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న దయనీయ పరిస్థితుల పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి సైతం భయపడేలా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. డార్మెటరీలు టాయ్ లెట్లు, కిచెన్, స్టోర్ రూం

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### ఆందోళన..

భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ సర్కారు ప్రచారం ఉత్తదేనని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. ఎనిమిది ప్రధాన పరిశ్రమల ఉత్పత్తి సూచీ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో వృద్ధి మూడు నెలల కనిష్టానికి పడిపోయింది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ఏడాదిగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... కేంద్రం నిర్లిప్తంగా ఉండటమే ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ఫిబ్రవరి 2026లో సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. ప్రస్తుత వృద్ధి రేటు 6.5 -- 7 శాతం వద్దే కొట్టుమిట్టాడుతోంది. అది కూడా అంకెల గారడితోనే.. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదన. జిడిపి లెక్కల్ని ఐఎంఎఫ్ సైతం తప్పుబట్టడం మన గణాంకాలపై ప్రపంచానికి నమ్మకం లేదనడానికి నిదర్శనం. స్టాక్ మార్కెట్‌కు గత ఆర్థిక సంవత్సరం 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. సోమవారం ఒక్కరోజే తొమ్మిది లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది. మార్చి నెలలోనే రూ.1.1 లక్షల కోట్లు (12 బిలియన్ డాలర్లు)పైగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐలు)ను పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్నారు. అయినా విదేశీ పెట్టుబడులు వచ్చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఊదరగొడుతూనే ఉన్నారు. నరేంద్రమోడీ ఢిల్లీలో గద్దెనెక్కక ముందు 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియాలోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికే. ప్రభుత్వ లెక్కల్లో మొత్తం నిరుద్యోగిత రేటు 3.1 శాతం వద్ద ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ... పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం.. దేశంలో పట్టభద్రుల నిరుద్యోగిత రేటు 11.2 శాతంగా ఉంది. గ్రామీణ పట్టభద్రుల్లో ఇది 11.8 శాతానికి చేరడం మరింత ప్రమాదకరం. ఈ ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేకపోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం.

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## నీటిపారుదల శాఖ అధికారులపై మంత్రి నిమ్మల సీరియస్..



**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై మంత్రి నిమ్మల రామానాయుడు సీరియస్ అయ్యారు. విధి నిర్వహణలో అలసత్వంపై మంత్రి ఆగ్రహించారు. నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత పనుల అంచనాల తయారీపై అధికారులతో మంత్రి నిమ్మల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంచనాల తయారీపై ఇరిగేషన్ అధికారులు అలసత్వం ప్రదర్శించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే నెలల్లో చేయాల్సిన పనులకు సంబంధించి ఇంకెప్పుడు అంచనాలు రూపొందిస్తారని సీఈలను మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏప్రిల్, మేలో చేసే పనులకు జూన్‌లో అనుమతులు ఇచ్చేవారని.. గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా ఇప్పుడూ ప్రవర్తిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు ఇకనైనా తీరు మార్చుకోవాలని మంత్రి నిమ్మల హితవు పలికారు. ఆదివారం సాయంత్రంలోగా అంచనాలు సమర్పించాలని సీఈలకు ఆదేశాలు జారీ చేశారు. గడువులోగా అంచనాలు సమర్పించని సీఈలు సోమవారం నాడు అమరావతి సచివాలయానికి వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికలు తీయకపోవడంతో సాగునీరందక గత ఐదేళ్ల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు కేటాయించి, చివరి ఎకరం వరకూ సాగునీరందించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో కాలువల మరమ్మతు పనులు చేపట్టామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలు, ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అమరావతికి 200 ఏళ్లు పడుతుంది: రాచమల్లు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారని వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవతల రాజధాని నిర్మిస్తామంటూ 2014లో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు కేవలం భూ దోపిడీకే పరిమితమైందని ఆయన ఆరోపించారు. బంగారు పండించే 50 వేల ఎకరాల భూములను రైతుల నుంచి దుర్మార్గంగా లాక్కున్నారని మండిపడ్డారు.

రెండు లక్షల కోట్ల వ్యయంతో లక్ష ఎకరాల్లో నిర్మాణం చేపడతామన్న బాబు, గత ఏడేళ్లలో కేవలం 80 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ఇదే వేగంతో వెళితే రాజధాని పూర్తి కావడానికి 200 ఏళ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెప్పి, ఇప్పటికే వేల కోట్లు అప్పులు చేశారని, చదరపు అడుగుకు రూ. 4 వేలు ఖర్చయ్యే చోట రూ. 14 వేలు చూపిస్తూ నిధులు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణం కేవలం బేతాళ కథల వంటిదని, చంద్రబాబు హయాంలో ఇది ఎప్పటికీ పూర్తి కాదని రాచమల్లు స్పష్టం చేశారు.

## దేశ వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడేను జరుపుకున్న క్రైస్తవులు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఇవాళ గుడ్ ఫ్రైడే జరుపుకుంటున్నారు. ఏసుక్రీస్తు ప్రాణాలను త్యాగం చేసిన రోజును స్మరించుకుంటున్నారు. క్రీస్తు సిలువ మరణాన్ని ధ్యానిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు, మౌన ప్రదర్శనలు చేస్తున్నారు. భక్తి గీతాలను ఆలపిస్తున్నారు. సిలువను ముద్దుపెట్టుకోవడం, క్రీస్తు త్యాగాన్ని స్మరించుకోవడం ఈ రోజు చర్చిలలో ప్రధాన ఘట్టాలు. పశ్చిమ బెంగాల్ రాజధానిలో తెల్లవారుజాము నుండే భక్తులు సెయింట్ పాల్స్ కేథడ్రల్ వంటి ప్రముఖ చర్చిలకు పోటెత్తారు. నగరం నలుమూలల 'వే ఆఫ్ ది క్రాస్' (సిలువ మార్గం) ఊరేగింపులు నిర్వహించారు. క్రీస్తు పడిన శ్రమలను గుర్తుచేసుకుంటూ భక్తులు మౌన ప్రదర్శనలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని శాక్రెడ్ హార్ట్ కేథడ్రల్‌లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. దక్షిణ భారతం లోనూ గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. కేరళ, తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లోని చర్చిలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. క్రీస్తు ఏడు మాటలపై ప్రత్యేక ప్రసంగాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలు అయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో గుడ్‌ఫ్రైడ్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్ని చర్చిల్లో యేసుక్రీస్తు ప్రభువు సిలువలో పలికిన 7 మాటలను జ్ఞాపకం చేసుకున్నారు. యేసుక్రీస్తు ప్రేమ, దయ, కరుణ, విమోచన, కృపను పాస్టర్లు తమ సందేశాల్లో విశ్వాసులకు తెలియజేశారు. చర్చిలన్ని క్రైస్తవ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

(మొదటిపేజీ తరువాయి)

## మేం శాసనం చేశాం: చంద్రబాబు

నిర్మాణం పూర్తయితే అభివృద్ధి ఆటోపైలట్‌గా జరిగిపోతుందన్నారు. ప్రపంచంలోని వేర్వేరు ప్రాజెక్టులు ఈ మోడల్‌లోనే అభివృద్ధి అయ్యాయని తెలిపారు. 2029లో మళ్లీ ప్రధాని మోదీతో ఈ ప్రాజెక్టులన్నీ ప్రారంభింపచేస్తామన్నారు. అమరావతి అజేయం, శాశ్వతం, అన్ స్టాపబుల్ దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయని సీఎం స్పష్టం చేశారు. దేశానికి అమరావతి ప్రైడ్‌గా నిలుస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. అందుకే అమరావతి తీర్మానం పెట్టి పార్లమెంటుకు పంపితే దానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని వివరించారు. బ్లూ, గ్రీన్ సిటీగా, అధునాతన నగరంగా అమరావతిని తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేశామన్నారు. రహదారులు, విద్యుత్ కోసం డక్ట్?లు, క్లీన్ అండ్ గ్రీన్ విధానంలో చేపట్టామన్నారు. 1,307 ఎకరాలను 113 సంస్థలకు రాజధానిలో భూములు కేటాయించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర విభజన నాటి కష్టాలను చంద్రబాబు గుర్తుచేశారు. తెలంగాణకు తాము వ్యతిరేకం కాదని మొదటి నుంచీ చెప్తున్నానని ఆ రాష్ట్రానికి నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోనని తేల్చిచెప్పారు. తెలంగాణకు హైదరాబాద్ ఉందన్న సీఎం మనకి అలాంటి నగరం కావాలని ఒక సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. అన్ని ప్రాంతాలకు మధ్యలో అమరావతి ఉందని తెలిపారు. అమరావతి కి అటు 12, ఇటు 12 పార్లమెంట్ స్థానాల మధ్యలో ఉందన్నారు. అమరావతి పేరుకి ప్రదేశానికి ఒక చరిత్ర ఉందని గుర్తుచేశారు. అమరావతిని వ్యతిరేకించినా గత పాలకులు గతిలేని పరిస్థితిలో ఇక్కడి నుంచే పాలన సాగించారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. భూములు ఇచ్చిన వారంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. శంషాబాద్?లో భూములు ఇచ్చిన వారంతా కోటీశ్వరులు అయ్యారని గుర్తుచేశారు. నాలెడ్జి ఎకానమీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు వేసిన పునాదుల వల్ల మోస్ట్ లివబుల్ సిటిగా అది మారిందన్నారు. వైఎస్సార్సీపీ వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. అమరావతిని వైఎస్సార్సీపీ నాశనం చేస్తే తాము శాసనం చేశామని సీఎం తెలిపారు. ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత లభించటం ప్రజా విజయమన్నారు. అమరావతికి చట్టబద్ధత లభించినందుకు మీడియా ప్రతినిధులందరికీ స్వయంగా స్వీట్లు పంచారు. ఆనందంలో ఇవాళ తాను కూడా స్వీట్ తింటానంటూ చంద్రబాబు రుచి చూశారు. రాష్ట్రం, దేశం నాశనమైనా పర్లేదు తమకు స్వార్థ రాజకీయమే ముఖ్యం అన్నట్లు వైఎస్సార్సీపీ వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అమరావతి అడుగు పడిన సమయంలోనే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారని దుయ్యబట్టారు. అమరావతిపై వ్యతిరేకతతో ప్రపంచబ్యాంకుకు కూడా లేఖలు రాయడం సహా అరాచకం సృష్టించే ప్రయత్నించారని విమర్శించారు. అమరావతిని ఎడారి, శ్మశానం అనడంతో పాటు భూకంపాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేశారని ఆక్షేపించారు. ఎన్ని విధాలా రాజధానిని నష్టపరచాలో అంతా చేశారని ఇప్పటికీ చేస్తునే ఉన్నారని ధ్వజమెత్తారు.

## మాపై వివక్ష చూపారు

20 నిమిషాల సమయం కేటాయించడాన్ని వారు తప్పుబట్టారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కానీ తమపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు జరిగే న్యాయంపై ఎటువంటి స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. గుంటూరు - మచిలీపట్నం కారిడార్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయాలని జగన్ కోరిన విషయాన్ని వారు ఉపరాష్ట్రపతికి వివరించారు. చట్టసభల్లో తమ గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని, సంఖ్యాబలం ఉన్న పార్టీలకు తగిన సమయం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజధాని విషయంలో తాము సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

## ముగ్గురు యువకులు మృతి

ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ను, బస్సు ను అదుపులోకి తీసుకొని యలమంచిలి సీఐ ధనుంజయరావు కేసు నమోదు విచారణ చేస్తున్నారు. బంగారు నాని, ఇల్లపు గోవిందు, బంగారు దుర్గ ప్రసాద్ ముగ్గురూ ఒకే సామాజిక వర్గం ఎస్సి -- రెల్లి సామాజిక వర్గం చెందిన వారు. ముగ్గురు కలిసి పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బంగారు నానికి నాలుగు సంత్సరాల బాబు, రెండు సంత్సరాల పాప ఊన్నారు. ఇల్లపు గోవిందుకు ఇటీవలే పెళ్లి అయ్యింది. బంగారు దుర్గ ప్రసాద్ కి ఒక తమ్ముడు ఉన్నాడు. కుటుంబానికి ఆర్థిక చేయి అందించే ముగ్గురూ చనిపోవడంతో మూడు కుటుంబాలు శోకసముద్రంలో మునిగాయి. పురుషోత్తపురం, ఏటికొప్పాక, పోతిరెడ్డి పాలెం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అమరావతిని జగన్ ఇంచు కూడా కదపలేరు: గంటా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డివివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరుకాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## 'జ్యోతిర్గమయ'తో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా సమాజంలో జీవిస్తున్న ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పిస్తున్నట్లు విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ వద్ద అవకాశాలు లేని ట్రాన్స్ జెండర్లకు జ్యోతిర్గమయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లు సిగల్ పాయింట్‌లు, షాప్‌ల వద్ద భిక్షాటన చేయడం, కొన్ని సందర్భాలలో సామాన్యులపై దౌర్జన్యాలకు పాల్పడటంపై ఫిర్యాదులొచ్చాయని తెలిపారు. దీనిపై ట్రాన్స్ జెండర్లు, వారి గురువులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకొని, వారికి సమాజంలో గుర్తింపు కలిగే జీవనం కలిగించేందుకు జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించి వారి విద్యార్హతలను ఉద్యోగ అవకాశాలు, వ్యాపార రుణాలు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. 20 మందికి జివిఎంసిలో ఉపాధి జివిఎంసిలో 20 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించినట్లు పోలీసు కమిషనర్ తెలిపారు. మరో ఆరుగురికి స్వయం ఉపాధిలో భాగంగా పాన్?, కిరణాషాప్‌ల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణాలు కల్పించినట్లు వివరించారు.

## రూ.900 కోట్లతో వీఎంఆర్డీఏ బడ్జెట్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.900 కోట్లతో బడ్జెట్ రూపొందించిందని, బోర్డు సమావేశంలో పెట్టి ఆమోదం తీసుకోవలసి ఉందని కమిషనర్ తేజ్ భరత్ వెల్లడించారు. ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఇది కాకుండా మరో వేయి కోట్ల రూపాయల ఆదాయం సాధించేందుకు కొత్త లేఅవుట్లను అభివృద్ధి చేస్తామని, ప్రస్తుతం ఉన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి ప్లాట్లను వేలానికి పెడతామన్నారు. మాస్టర్ ప్లాన్-2041పై స్వీకరించిన అభ్యంతరాలన్నీ క్రోడీకరించి, నివేదిక తయారు చేస్తున్నామని చెప్పారు. వాటిని వారం రోజుల్లో ప్రభుత్వానికి పంపిస్తామని, అక్కడ టెక్నికల్ కమిటీ ఉన్నతాధికారులు పరిశీలించి సూచనలు చేస్తారని, దానిపై తుది నోటిఫికేషన్ ఇచ్చి అమలులోకి తీసుకువస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల సందర్శనకు కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన టికెట్ విధానంపై అందరికీ అవగాహన కల్పించామని, విస్తృత ప్రచారం కూడా చేస్తున్నామన్నారు.

## చంద్రబాబు పోరాట ఫలితమే అమరావతికి చట్టబద్ధత: మాధవ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయి అని బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కొనియాడారు. ఈ విజయం వెనుక వేలాది మంది రైతుల త్యాగాలు, పోరాటాలు ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో ఏ రాజధానికి లేని విధంగా పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతుతో అమరావతికి గుర్తింపు రావడం గొప్ప విషయమని ఆయన అన్నారు. అమరావతికి పునాది వేసిన నాటి నుండి ప్రధాని మోదీ రాజధానికి అండగా నిలుస్తున్నారని మాధవ్ పేర్కొన్నారు. శంకుస్థాపన సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న పుణ్యక్షేత్రాల నుంచి పవిత్ర జలాలు, మట్టిని తీసుకురావడం ద్వారా ప్రతి భారతీయుడిని ఈ నిర్మాణంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని, భవిష్యత్తులో ఇది ప్రపంచ స్థాయి నగరంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషిని మాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఎన్నో అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా అమరావతి కోసం ఆయన చేసిన పోరాటం ఫలితమే ఈ రోజు ఈ చట్టబద్ధత అని కొనియాడారు. రాజధాని ఎంపిక కమిటీలో సభ్యుడిగా పనిచేసే అవకాశం రావడం తనకెంతో గర్వకారణమని అన్నారు.

## కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ అభివృద్ధికి ప్రణాళికలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో వాహనాలు రాకపోకలు అధికంగా పెరుగుతున్న దృష్ట్యా పలు కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. తూర్పు జోన్ పరిధిలోని విమ్స్ హాస్పిటల్ నుండి విశాఖ వ్యాలీ స్కూల్ జంక్షన్ వరకు, హనుమంతువాక జంక్షన్ వరకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి పర్యటించారు. హనుమంతువాక జంక్షన్ నుండి విశాఖ వ్యాలీ జంక్షన్ పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలు అధికం కావడంతో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీ ఉంటోందని, వాహనాలు, ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. దీనిపై జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆదర్శనగర్ ఓల్డ్ డెయిరీ ఫారం జంక్షన్ వద్ద ఇరువైపులా ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శనగర్, ఇందిరానగర్ వద్ద హైవే రోడ్డులో కాలువ నిర్మిస్తే రోడ్డు వెడల్పు అవుతుందని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విశాలాక్షినగర్ మొదటి, రెండు రోడ్లను, కైలాసగిరి రోడ్డు తదితర ప్రాంతాలను ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు హనుమంతవాక జంక్షన్‌లో విశాలాక్షి నగర్ వైపు వెళ్లే కుడివైపు ఉన్న ఖాళీ స్థలంలో ఆకర్షణీయంగా గ్రీనరీ, ఫౌంటైన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంతిరాజుకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం 9వ వార్డు వెటర్నరీ కాలనీలో పారిశుధ్య పనులను జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వి.నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, ఎఎంఒహెచ్ బి.ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుతో యువతకు ఉపాధి




**సీలేరు పతాకం న్యూస్:** సీలేరు వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు నిర్మిస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అన్నారు. ఇక్కడి ఏపీ జెన్‌కో కల్యాణమండంలో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీలేరు పంచాయతీ పరిధిలో తగిన విద్యార్హతలు వున్న 50 మంది నిరుద్యోగులను ఎంపిక చేసి, గ్రామ పంచాయతీ తీర్మానం చేసిన వారికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. సెక్యూరిటీ గార్డులుగా 15 మంది, ఫైర్, పెట్రోలింగ్ సిబ్బంది 11 మందితో ఇతర సిబ్బందిని నియమిస్తామని ఆమె అన్నారు. ఎంపిక అయిన వారికి నైపుణ్య శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. స్థానిక మారెమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఏరోడ్రోమ్ వద్ద లాండింగ్ ప్రదేశానికి మెయిన్ రోడ్డు నుంచి 1.5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరుగుతుందని, ఈ పనులను ఏరోడ్రోమ్ ప్రాజెక్టువారే చేస్తారని ఆమె వెల్లడించారు. వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలపాలని ఆమె కోరారు.ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, ఉపసర్పంచ్ కె.వల్లీప్రసాద్, కూటమినాయకులు, గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ, వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు ఏర్పాటుపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఆర్‌వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారిని అభివృద్ధి చేయాలని, లేకపోతే ఈ ప్రాంతానికి పర్యాటకులు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. దండకారణ్య రాష్ట్ర విమోచన సమితి రాష్ట్ర అ?ధ్యక్షుడు మార్కురాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ మాట్లాడుతూ, వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టులో ఆదివాసీలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేనిపక్షంలో ప్రాజెక్టును అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ బి.బి.సరిత, సర్వే ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, జీకేవీధి తహశీల్దార్ అన్నాజీరావు, ఏపీ జెన్‌కో ఎస్‌ఈ జాకీర్ హుసేన్, ఈఈ బాలకృష్ణ, ఇన్‌చార్జి ఈఈ జైపాల్, ఏడీఈ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీపూజ.. మారెమ్మ ఆలయం ఎదురుగా నిర్మించతలపెట్టిన సీప్లేన్ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించారు.

## భారీగా విశాఖ పోర్టు విస్తరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ నగరంలో కాలుష్యానికి కారణమవుతున్న బొగ్గు, ఇతర సరుకుల ఎగుమతి, దిగుమతులను దశల వారీగా వేరే పోర్టుకు తరలిస్తామని ఇన్‌చార్జి చైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. పోర్టు వాటాదారులతో నోవాటెల్ హోటల్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, విశాఖపట్నం పోర్టు ఏర్పాటై 92 ఏళ్లు పూర్తయ్యిందని, నగరంతో పాటే పోర్టు కూడా అభివృద్ధి చెందిందన్నారు. విశాఖలో ప్రతి పౌరుడికి పోర్టుతో అనుబంధం ఉందని, దానిని కొనసాగించాలనేదే తమ ధ్యేయమన్నారు. పోర్టులో ఒక మిలియన్ టన్ను సరుకు రవాణా చేస్తే మూడు వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఈ ఏడాది తాము 91 మిలియన్ టన్నులు హ్యాండిల్ చేశామన్నారు. వంద మిలియన్ టన్నులు లక్ష్యం పెట్టుకున్నామని, తద్వారా మరో 30 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖపట్నం పోర్టును భారీగా విస్తరిస్తున్నామని, ఇతర కార్యకలాపాల్లోకి కూడా వెళుతున్నామని అంగముత్తు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టును అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామన్నారు. విశాఖలో వాయు కాలుష్యానికి కారణమవుతున్న బొగ్గు, తదితర సరకులను ఆ పోర్టుకు తరలిస్తామని చెప్పారు. కొత్తగా నౌకా నిర్మాణ రంగంలోకి కూడా వెళుతున్నామని, దుగరాజుపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మించబోతున్నామన్నారు. విశాఖ పోర్టును దశల వారీగా సంప్రదాయ రీతిలో అభివృద్ధి చేస్తున్నామని, అందరికీ పోటీగా నిలుస్తున్నామన్నారు. పోర్టులో లాజిస్టిక్స్ కోసం రూ.3 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రైల్వే పనులు, రహదారుల విస్తరణకు ఈ నిధులు ఉపయోగిస్తున్నామన్నారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్, అక్కడి నుంచి సబ్బవరం వరకు రహదారులను భారీగా విస్తరిస్తున్నామని, వీటికే రూ.1,100 కోట్లు పెడుతున్నామన్నారు. గత ఏడాది 82.6 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయగా ఈ ఏడాది అది 91.17 మిలియన్ టన్నులకు చేరిందన్నారు. ఒక్క పెట్రోలియం ఉత్పత్తులే 25శాతం పెరిగాయన్నారు. ఇంకా ఎరువులు 45 శాతం, ఐరన్‌ఓర్ 15 శాతం పెరిగాయన్నారు. నగరంలో పది లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికి నాలుగు లక్షల మొక్కలు నాటామని, మిగిలిన ఆరు లక్షలను రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ రోశ్ని అపరాంజి, సెక్రటరీ శంకర్ బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ఇంటింటా ప్రచారం



**ఆనందపురం, పతాకం న్యూస్:** రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దుక్కవానిపాలెం, మెట్టమీద పాలెం, పెద్దిపాలెం పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలో విశాలమైన ఆట స్థలం, ప్రత్యేక వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాలనాయుడు వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహామూర్తి తదితరులు ఉన్నారు.

## పోలీసులపై మరోసారి ఫైర్ అయిన పేర్ని నాని



**మచిలీపట్నం, పతాకం న్యూస్:** మచిలీపట్నంలో ఒక ఇంటి కూల్చివేత ఉదంతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టులపై పోలీసులు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తమపై కేసు నమోదు చేయడంపై పేర్ని నాని ఘాటుగా స్పందించారు. "పోలీసులు మమ్మల్ని ఏకవచనంతో దూషించలేదా? తప్పుడు నాయకులు ఉన్నట్లే, తప్పుడు అధికారులు కూడా ఉంటారు" అని మండిపడ్డారు. జిల్లాలోని 4 వేల మంది అధికారుల్లో 3 వేల మంది నిజాయతీపరులేనని, కానీ కొందరు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "రెడ్ బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఒక సీఐకి పోస్టింగ్ ఇచ్చి, జాయిన్ అవ్వగానే ఎందుకు ఖాళీ చేయించారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పులను నిలదీయడమే తన పని అని పేర్ని నాని స్పష్టం చేశారు. "నన్ను జైలుకు పంపినా సరే, ఇలాగే ప్రశ్నిస్తూనే ఉంటాను. తప్పు చేసిన అధికారిని నిలదీస్తే అందరినీ అన్నట్లు కాదు" అని వివరణ ఇచ్చారు. నిన్నటి గొడవలో పోలీసులు తమతో ప్రవర్తించిన తీరు వల్లే తాము రియాక్ట్ అయ్యామని ఆయన పేర్కొన్నారు. ఘటన వివరాల్లోకి వెళితే... పట్టణంలోని కొబ్బరితోట ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారనే సాకుతో ఒక ఇంటిని అధికారులు కూల్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టులపై కేసులు నమోదయ్యాయి. దీనిపై స్పందించిన పేర్ని నాని, కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. ఈ క్రమంలో, పోలీసులపై అభ్యంతరకర పదజాలం వాడారన్న ఇనుగుదురుపేట సీఐ పరమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పేర్ని కిట్టుపై బీఎన్ఎస్ 132, 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదైంది. చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై కూడా కేసు ఫైల్ చేశారు.

## పిఆర్ఎస్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్



**పూసపాటిరేగ, పతాకం న్యూస్:** మండలంలోని కుమిలి గ్రామంలో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన పిఆర్ఎస్ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ కమ్యూనిటీ హాల్‌ను ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌బాబు పొట్లూరి ఆర్థిక సహకారంతో, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కుమిలి గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజల సామాజిక అవసరాలను తీర్చడంలో ఈ కమ్యూనిటీ హాల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి, అత్యాధునిక సదుపాయాలతో ఈ భవనాన్ని నిర్మించి అందించిన ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ గ్రామస్తుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని, దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఎంఎస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌బాబు పొట్లూరి మాట్లాడుతూ సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా తమ సంస్థ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ అవసరం ఉందని గ్రామ పెద్దలు కోరడంతో రూ.1.60 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. కొప్పెర్ల గురుకుల పాఠశాలలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు, పూసపాటిరేగ హైస్కూల్‌లో రూ.1.8 కోట్లతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పతివాడ, గుంపాం గ్రామాల్లో కూడా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మహంతి చిన్నమనాయుడు, మహంతి శంకర్రావు, దల్లి ముత్యాలరెడ్డి, కోట్ల రఘు, పతివాడ శ్రీను, బాల అప్పలరాజు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కుమిలి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**చీపురుపల్లి, పతాకం న్యూస్:** సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి ఎఆర్ దామోదర్ అన్నారు. చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సర్కిల్ భవనాన్ని చీపురుపల్లి డిఎస్పి ఎస్ రాఘవులుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి విశ్రాంత ఉద్యోగులు సైబర్ మోసాలకు ఎక్కువ శాతం గురవుతున్నారన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అరెస్టు చేస్తామంటూ భయపెట్టిన వారిని నమ్మకుండా అవసరమైతే 1974 నెంబర్‌కు గాని డయల్ 100కు గాని ఫోన్ చేసి పోలీసులు సహకారం తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించిన కారణంగా సుమారు జిల్లాలో 200 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శంకర్రావు, ఇన్‌ఛార్జి ఎస్ఐ లోకేష్, గుర్ల ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

## అమరావతిపై విజయసాయిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ బిల్లును ఆమోదించిన నేపథ్యంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అమరావతిపై 'కమరావతి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య దుమారం రేపగా, ఆ తర్వాత ఇచ్చిన వివరణలో ఆయన అధికార కూటమితో పాటు తాను వీడిన వైసీపీని కూడా లక్ష్యంగా చేసుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడంపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో "రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీకి ఒక సూచన. ప్రభుత్వం కట్టేది అమరావతే తప్ప, కమరావతి కాకుండా చూచుకోండి.. తస్మాత్ జాగ్రత్త" అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌లోని 'కమరావతి' పదంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. తన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో విజయసాయిరెడ్డి మరో ట్వీట్‌తో స్పందించారు. "నిన్నటి నా ట్వీట్‌లో అమరావతిని కమరావతి కానివ్వవద్దు అన్న సూచనను చూసి గంగవెర్రులెత్తిన వారంతా, కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలకు ఏమి బదులిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టమైన, స్థిరమైన విధానం లేదని, అదే సమయంలో టీడీపీకి ఇసుమంతైనా చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా తన మాజీ పార్టీ వైసీపీ ఎంపీల తీరును కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "సాక్షాత్తు మీ వైసీపీ పార్టీ అధ్యక్షుడి పైన రాజ్యసభలో ఒక కాంగ్రెస్ ఎంపీ అలా నోరు పారేసుకుంటుంటే వైసీపీ ఎంపీలకు చీమకుట్టినట్లైనా అనిపించలేదా? అడ్డుకోరా? ఖండించరా? మౌన ప్రేక్షకులైనారా?" అంటూ నిలదీశారు. 2024 ఎన్నికల తర్వాత విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగి వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించినప్పటికీ, ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఏపీ రాజకీయాలపై తరచూ స్పందిస్తూ, కీలక వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజా వ్యాఖ్యలతో ఆయన అధికార, ప్రతిపక్ష పార్టీలను ఏకకాలంలో లక్ష్యంగా చేసుకున్నారు.

# స్మార్ట్ కిచెన్ లు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్ కిచెన్ లు పేరుతో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్ పి అర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం నిర్వాహకం స్మార్ట్ కిచెన్లుకు ఇవ్వొద్దు, వేడివేడి భోజనాన్ని పిల్లలకుదూరం చెయ్యొద్దు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఉపాధిని తీయొద్దన్నారు. స్మార్ట్ కిచెన్ పేరుతో వచ్చే సంవత్సరం స్కూల్స్ లో భోజనాలు మిడ్ డే మీల్ వర్కర్లకు లేకుండా ప్రైవేటు వెహికల్స్ తో స్కూల్స్ పంపిస్తామని జిల్లా అధికారులు చెప్తున్నారు దీనివల్ల జిల్లాలో ఉన్న నాలుగువేల మంది కార్మికులు ఉపాధి పోతుందన్నారు. గత 25 సంవత్సరాల నుండి బిల్లులు రాకపోయినా, జీతాలు రాకపోయినా, అప్పులు చేసి పుస్తెలతాలు తాకట్టు పెట్టి పిల్లలకి వేడివేడి భోజనం పెట్టారన్నారు. ఈరోజు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేటీకరణ చేయాలని ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు, దీన్ని వెనక్కి తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ఈ జిల్లాలో నెల్లిమర్ల ప్రాంతం నవప్రయాస్ ఇవ్వడానికి ప్రయత్నం చేశారు, మధ్యాహ్న భోజన పథక కార్మిక యూనియన్ గా సిఐటియుగా ఎస్ఎఫ్ఐ అన్ని ప్రజాసంఘాలు కూడగట్టి పోరాటం చేసాము, ప్రభుత్వం దిగివచ్చి ప్రైవేటీకరణ వెనక్కి తీసుకుందన్నారు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేటీకరణ ఆపాలి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రయత్నం జరుగుతుంది, వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున పిల్లల తల్లిదండ్రులతో ప్రజా సంఘాలతో ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. పిల్లలకు మెనూ చార్జి 20 రూపాయలుపెంచాలనీ, ,ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.విలేకర్ల సమావేశంలో అధ్యక్షురాలు మంగళలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి, సీత, దేవి పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లలో పారదర్శకత అవసరం'



**పార్వతీపురం, పతాకం న్యూస్:** రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలిం చి రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన క్రయ, విక్రయదారులతో మాట్లాడారు. ప్రభు త్వం అందిస్తున్న సేవల సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల వసూళ్లపై సమీక్షించారు. వేసవి దృష్ట్యా కార్యాలయ ప్రాంగణంలో తాగునీరు, నీడ వంటి కనీస వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

## సుదూర ప్రాంతాల నుంచి రెండు పూటలా పనికి రాలేం



**వేపాడ, పతాకం న్యూస్:** కెజిపూడి పంచాయతీలో ఉపాధి కూలీలు సుదూర ప్రాంతంలో పనిని బహిష్కరించారు. రెండు పూటలా పనులకు రాలేమని, సిగల్ లేకపోవడంతో ఫేషియల్ యాప్‌తో ఇబ్బందులు పడలేమని స్పష్టంచేశారు. వంతెనపూడి చెరువులో పని ప్రారంభించిన అనంతరం సిగ్నల్ బాధలతో ఇబ్బంది పడలేక కూలీలందరూ వెనుతిరిగి వెళ్లిపోయారు. వీరికి ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిపూడి పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల గిరిజనులు రెండు పూటలా పనికి వెళ్లాలంటే సుమారు 8, 9 కిలోమీటర్లు రావాల్సి వస్తుందని తెలిపారు. ఎక్కడ ఆవాసాలుంటే అక్కడ పని చూపకుండా ఒక కేంద్రంగా పెట్టడం వల్లే సుదూర ప్రాంతాల నుంచి రాలేకపోతున్నారని చెప్పారు. ఒకపూటే పనులు నిర్వహించాలని, ఫేషియల్ యాప్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా హాజరు వేయాలని డిమాండ్‌చేశారు.

## పోలవరం డయాఫ్రంవాల్ నష్టానికి బాధ్యులపై చర్య తీసుకోవాలి



**విజయవాడ, పతాకం న్యూస్:** : పోలవరం డయాఫ్రంవాల్ నష్టానికి బాధ్యులపై చర్య తీసుకోవాలని, రూ.1000 కోట్ల ప్రజా ధనాన్ని తిరిగి రాబట్టాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతినడం మూలంగా పునర్నిర్మించడానికి అదనంగా రూ.1000 కోట్లు ఖర్చు పెట్టినట్లు ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్ చేసిన ప్రకటనలపై సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తున్నదన్నారు. డయాఫ్రంవాల్ 2019లోనే పూర్తయినప్పటికీ ఆ తర్వాత వచ్చిన భారీ వరదలకు అది దెబ్బతిన్నదని, దీనికి ఎవరు కారణమో గత, ప్రస్తుత ప్రభుత్వాలు తేల్చకుండా తిరిగి కాంట్రాక్టర్లకు అదనపు నిధులు సమకూర్చినందున రూ.1000 కోట్లు ప్రజాధనం వృధా అయిందని, దీన్ని సంబంధిత బాధ్యుల నుండి రాబట్టాలని కోరారు. దీనికి బాధ్యత ఎవరిదో తేల్చాలన్నారు. ప్రభుత్వ అధికారులదా ? లేక కాంట్రాక్టర్లదా ? నిర్ధారణ చేయాలని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. రెండోసారి డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయినట్లు ప్రభుత్వం ప్రకటించిందని, దీని భద్రతపై నిపుణులతో పర్యవేక్షణ చేయించాలని, వారి నివేదికను ప్రజలకు వెల్లడించాలని సిపిఐ(యం) కోరుతున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## మద్యం అమ్మకాలతో రూ.1344 కోట్ల ఆదాయం



**విజయనగరం, పతాకం న్యూస్:** గత ఆర్థిక సంవత్సరం(2025-2026)లో జిల్లాలో మద్యం అమ్మకాలతో రూ.1344 కోట్ల ఆదాయం వచ్చిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి తెలిపారు. భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాది కంటే ఆదాయం తగ్గినా మద్యం కేసుల అమ్మకా లు పెరిగాయన్నారు. 2024-2025 ఏడాదిలో లిక్కరు కేసులు 17,65,507, బీరు కేసులు 6,40,418 అమ్మకాలు జరగ్గా.. తద్వారా రూ.1374కోట్ల ఆదాయం వచ్చిందన్నా రు. అయితే 2025-26 ఏడాదిలో 18,55,396 లిక్కర్ కేసులు, 9,41,475 బీరు కేసులు అమ్మకాలు జరగ్గా.. తద్వారా రూ.1344కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2025 మార్చి నెలలో రూ.119కోట్లు ఆదాయం రాగా, 2026 మార్చిలో రూ.125కోట్ల ఆదాయం వచ్చింద న్నా రు. 2025-26లో 808 మద్యం కేసులు నమోదు చేసి, 809 మందిని రిమాండుకు తరలించామని చెప్పారు. ఈ కేసుల్లో 1290 లీటర్ల లిక్కరు, 28 లీటర్ల బీరు సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో 169 మద్యం దుకాణాలు, 26 బార్‌లు ఉన్నాయన్నారు. అనంతరం రికార్డులు తని ఖీ చేశారు. సీఐ వి.రవికుమార్, ఎస్ఐ చంద్రమోహన్, ట్రైనీ ఎస్ఐ జె.రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన భూములకు రక్షణ కల్పించాలి



**శ్రీకాకుళం,, పతాకం న్యూస్:** గిరిజన భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాపరలో జరిగిన గిరిజన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విభజన అనంతరం జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం వల్ల గిరిజనులు ఇబ్బంది పడుతున్నా రని తెలిపారు. దీంతో గిరిజనులు తమ సమస్యలు తెలియజేసేందుకు సరైన వేదిక లేకుండా పోయిందన్నారు. అందువల్ల ఐటీడీఏ వచ్చేంత వరకూ గిరిజనులంతా ఐక్యంగా పొరాటాం చేయాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్ గిరిజన గ్రామాలును షెడ్యూల్ ప్రాంతాంలో కలపాలని డిమాండ్ చేశారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గిరిజన సంఘ రాష ?ట్రకార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ.. మద్ధతు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 20న అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పన్న, లక్ష్మణరావు, మోహన్‌రావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ-గ్రేడ్




**పలాస, పతాకం న్యూస్:** విద్యా ప్రమా ణాలు, నిర్వహణ విధానాలు ఉత్తమంగా ఉండడంతో స్థానిక ప్రభు త్వ డిగ్రీ కళాశాలకు ఏ-గ్రేడ్ గుర్తింపు లభించింది. అకడమిక్ ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్వైజర్స్‌గా ఎం.శాంతిహోమ్ (ఇంగ్లీషు లెక్చరర్, నరసన్నపేట), డాక్టర్ బి.వేణుగోపాలరావు(ఇంగ్లీషు లెక్చరర్, రాజాం)తో కూడిక బృందం డిగ్రీ కళాశాలలో ఆడిట్ నిర్వహించారు. కళాశాల ప్రమాణాలు, బోధన, రికార్డులు, అకడమిక్ పనితీరు పరిశీలించారు. అనంతరం కళాశాలకు ఏ-గ్రేడ్ గుర్తింపు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు అత్యుత్తమ ప్రమాణాలతో బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.వెంకటరమణ, మధు, శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.

## తయారీ రంగానికి తీవ్ర దెబ్బ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా యుద్ధోన్మాదం, అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణతో మార్చి నెలలో తయారీ రంగ పిఎంఐ 53.9కి పడిపోయిందని హెచ్ఎస్‌బిసి ఇండియా మాన్య ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) వెల్లడించింది. ఫిబ్రవరిలో 56.9 పాయింట్లు ఉండగా.. మార్చి నాటికి అది ఒక్కసారిగా 53.9 పాయింట్లకు తగ్గి నాలుగేళ్ల కనిష్టానికి దిగజారింది. 2022 జూన్ తర్వాత నమోదైన అత్యల్ప ఉత్పత్తి ఇదే కావడం గమనార్హం. సాధారణంగా 50 పైన పిఎంఐ ఉంటే మెరుగ్గా.. దిగువన ఉంటే ప్రతి కూలంగా ఉన్నట్లుగా గుర్తిస్తారు. గత రెండేళ్లలో ఎప్పుడూ లేనంతగా కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం మందగించాయి. ముడిసరుకుల ధరలు మూడున్నరేళ్ల గరిష్టానికి చేరడం తయారీదారుల నడ్డి విరుస్తోంది. ఖర్చులు పెరిగినా పోటీ తట్టుకోవడానికి విక్రయ ధరల ను పెంచలేకపోవడం వల్ల కంపెనీల లాభాలు ఆవిరవు తున్నాయి. డిమాండ్ తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి భారత పారిశ్రామిక వేగాన్ని ప్రశ్నార్థకం చేస్తు న్నాయని హెచ్ఎస్‌బిసి విశ్లేషించింది. 'తీవ్రమైన మార్కెట్ పోటీ, ముడిసరుకుల ధరల పెరుగుదల, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల కొత్త ఆర్డర్ల ప్రవాహం నెమ్మదించింది. ముఖ్యంగా అల్యూమినియం, రసాయనాలు, ఇంధనం, జనపనార, తోలు, వస్త్రాలు, ఉక్కు వంటి వస్తువుల ధరలు గత మూడేళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. దీనివల్ల తయారీదారులపై పెట్టుబడి భారం పెరిగినప్పటికీ, వినియోగదారులకు చేరే తుది వస్తువుల ధరలను కంపెనీలు ప్రస్తుతానికి నియంత్రణలోనే ఉంచుతున్నాయి.' అని హెచ్ఎస్‌బిసి చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజల్ భండారీ పేర్కొన్నారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం 2022 మధ్య కాలం తర్వాత ఎన్నడూ లేనంత నిదానంగా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడం, మార్కెట్ పరిస్థితులు సవాలుగా మారడంతో డిమాండ్ భారీగా మందగించింది. ముడి ఖర్చులు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, ఉన్న కస్టమర్లను కాపాడుకోవడానికి, కొత్త వారిని ఆకర్షించడానికి కంపెనీలు తమ విక్రయ ధరలను పెంచలేకపోతున్నాయి. దీనివల్ల తయారీదారుల లాభాల మార్జిన్లు కుంచించుకుపోతున్నాయి. అంతిమంగా పెరుగుతున్న వ్యయాలు, తగ్గుతున్న డిమాండ్‌తో భారత పరిశ్రమలు కుదేలవుతున్నాయి.

## వెంటనే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సింహాచలం, ఎం.శంకర్రావు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 36 కోట్ల మంది కార్మిక వర్గం ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేసినప్పటికీ నాలుగు లేబర్ కోడ్లను ఏప్రిల్ 1నుంచి అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ లేబర్ కోడ్లకు నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.శివ, పి.వరదరాజు, బి.రవి, గుంపస్వామి, ఆనంద్, గంగరాజు, సుజాత, ఇప్పలమ్మ, పాపలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## సమయపాలన పాటించకపోతే చర్యలు



**విజయనగరం, పతాకం న్యూస్:** గజపతినగరం రెండో నంబర్ సచివాలయాన్ని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు తీరును పరిశీలించిన కలెక్టర్, విధులకు ఆలస్యంగా వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని సిబ్బందికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. అనంతరం సచివాలయ ప్రాంగణాన్ని పరిశీలించి, పరిశుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్‌పురిటిపెంట-1 అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. అక్కడ విధుల్లో ఉండాల్సిన అంగన్వాడీ కార్యకర్త గైర్హాజరు కావడాన్ని గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చిన్నారుల సంరక్షణ, పౌష్టికాహార పంపిణీలో ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన సిడిపిఒ, సూపర్వైజర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కేంద్రాల నిర్వహణలో పర్యవేక్షణ లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులతో మమేకమై వారి యోగ క్షేమాలను విచారించారు.

# ఇకపై గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన




**అమరావతి, పతాకం న్యూస్:** ఇకపై గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో పాలనాధికారాలన్నీ ప్రత్యేకాధికారుల పరిధిలోకి వెళ్లిపోయాయి. మళ్లీ ఎన్నికలు జరిగే వరకూ ఆయా పంచాయతీల్లో కార్యకలాపాలను ప్రత్యేకాధికారులే నిర్వహించనున్నారు. మరో ఏడాది పాటు స్థానిక ఎన్నికలు లేవనే సంకేతాలు వస్తున్న నేపథ్యంలో అప్పటి వరకూ వీరి ఆధ్వర్యంలోనే పంచాయతీ పాలన సాగనుంది. రెండు రోజుల ప్రత్యేక అధికారుల జాబితా సిద్ధమైంది. ఎ-గ్రేడ్ పంచాయతీలను జిల్లా స్థాయి అధికారులకు, బి, సి గ్రేడ్ పంచాయతీలను మండల స్థాయి అధికారులకు అప్పగించారు. ఈ మేరకు ఆయా జాబితాలకు కలెక్టర్లు ఆమోద ముద్ర వేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 322 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను కేటాయిస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 1,101 పంచాయతీలున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలతోపాటు, తుని పురపాలక సంఘంలో మొత్తం 31 గ్రామాలను విలీనం చేయనున్నట్లు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. మిగలిన పంచాయతీలకు 2021 ఫిబ్రవరిలో నాలుగు దశల్లో ఎన్నికలు జరిగాయి. కాకినాడ జిల్లాలో 385, తూర్పుగోదావరి జిల్లాలో 342, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 342 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఏప్రిల్ 3న పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈనెల 2వ తేదీతో పంచాయతీల ఐదేళ్ల పాలనాకాలం ముగిసింది. వారి స్థానంలో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించనుంది. వ్యవసాయం, విద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, రెవెన్యూ తదితర విభాగాల్లోని మండల స్థాయి అధికారులను గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. ఈనెల 3 నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన జరుగనుంది. ఈ నేపథ్యంలో వారు తమ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు కనీస వసతులు కల్పించాల్సి ఉంది. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి. పారిశుధ్యాన్ని మెరుగుదల చేయడం, దోమల వ్యాప్తిని నిరోధించటం, వీధి లైట్లు వెలిగేలా చూడటం, వీధులన్ని శుభ్రం చేయించడం, మురికి కాలువల్లో చెత్తా, చెదారం లేకుండా చూడటం, తదితర ప్రధాన పనులు నిర్వహించాలి. ఒక్కో అధికారిని ఐదు నుంచి ఆరు వరకూ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించ నున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. గ్రేడ్ వన్ స్థాయిలో ఉన్న గ్రామపంచాయతీలకు ఒక్కో అధికారిని మాత్రమే నియ మిస్తారు. గ్రేడ్ 2, 3 పంచాయతీలకు కొన్నింటికి కలిపి ఒక ప్రత్యేక అధికారిని నియమించే అవకాశం ఉంది. అయితే ప్రత్యేక అధికారుల పాలనాలో పంచాయతీలు పలు సమస్యలు ఎదుర్కోనున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన అరకొరగానే జరుగుతుందనే ఆందోళన గ్రామీణ ప్రాంత ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పరువులు కోరుతున్నారు.ఎన్నికల సంఘం పంచాయతీలకు ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తుందనే దానిపై ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాల్సి ఉండగా కొన్ని కారణాలతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. దీనికితోడు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పల్లె పండగ పేరుతో గ్రామాల్లో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాలు మాత్రమే ప్రస్తుతం జరుగుతున్నాయి. సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలకు వాటి ద్వారా సక్రమంగా సేవలు అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అసంతప్తితో ప్రజలు కనిపిస్తున్నారు. మరో వైపు కుల గణన ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉన్న నేపథ్యంలో మరో ఆరు నెలల వరకూ స్థానిక సమరం లేనట్టే తెలుస్తుంది. మరోపక్క బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు తదితర అంశాల నేపథ్యంలో ఈ ఏడాదిలో ఎన్నికలు జరిగే అవకాశం కనిపించడం లేదు. దీంతో మరో సంవత్సరం పాటు స్థానిక ఎన్నికలకు సమయం పట్టే అవకాశం ఉందంటూ రాజకీయాలు విశ్లేషకులు చెబుతున్నారు.

# ఆయుష్ కళాశాలకు పిఠాపురంలో పేదల భూములు కేటాయింపు!

**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించిన భూమిని వర్మ హోటల్ నిర్మాణానికి మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాకినాడలో ఆయుష్ కళాశాలను పిఠాపురం తరలించాలని అధికారులు ప్రయత్నిస్తు న్నారు. కళాశాల నిర్మాణానికి పిఠాపురంలోని మసీదు మాన్యం భూములను కేటాయిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత సర్కారు ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించి పట్టాలిచ్చింది. ఈ భూములను కళాశాలకు కేటాయించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఎస్‌విఎస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతిపాదన మేరకు కాకినాడలో కన్వెన్షన్ సెంటర్ కమ్ 5 స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం 3.4 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఎక్కడ భూమిని కేటాయిస్తున్నారనే దానిపై ఈ ఉత్తర్వుల్లో స్పష్టత లేదు. కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ఆనుకుని ఆయుష్ ఆస్పత్రి సమీపంలో స్థలాన్ని కేటాయిస్తున్నారంటూ వార్తలు వచ్చాయి. నిబంధనల ప్రకారం ఆయుర్వేద వైద్య ఆస్పత్రికి అనుబంధంగానే కళాశాల కూడా ఉండాలి. ఈ మేరకు ఆస్పత్రిని ఆనుకుని ఉన్న ఐదు ఎకరాల్లో ఆయుష్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి కూడా ఇచ్చింది. కాకినాడ ఎంపి ఉదరు శ్రీనివాస్ ప్రయత్నం ఫలితంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.70 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.7 కోట్లు ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఖర్చు చేయాల్సి ఉంది. కానీ, అధికారులు ఎటువంటి పనులూ చేపట్టలేదు. వర్మకు ఈ స్థలాన్ని కేటాయించేందుకే ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని సిపిఎం సహా పలు ప్రజాసంఘాలు చెప్తున్నాయి. కళాశాలను తరలించడం ద్వారా ఆ స్థలాన్ని ఎస్‌విఎస్ కన్‌స్ట్రక్షన్స్‌కు కేటాయించేందుకు మార్గం సుగమం అయ్యినట్టైంది. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. పిఠాపురం శివారు మసీదు మాన్యం భూములను వైసిపి ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చింది. 2020లో సర్వే నెంబర్ 417, 470లలో 218 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించింది. 197 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు పొజిషన్ కూడా చూపించారు. ఈ స్థలాన్నే ఆయుష్ కళాశాల నిర్మాణానికి అధికారులు కేటాయిస్తూ ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం త్వరితగతిన రుణ సౌకర్యం కల్పిస్తే తాము ఇళ్లను నిర్మించుకునేందుకు సిద్ధమవుతున్నామని, ఇప్పుడు ఈ స్థలాలను ఖాళీ చేయాలని చెబితే ఎక్కడికి వెళ్తామంటూ



లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ స్థలాలను ఇతర అవసరాలకు కేటాయిస్తే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. పేదల భూములను స్వాధీనం చేసుకోవడం కన్నా, ఆయుష్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం ఇతర ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రయోజనాల పేరుతో బలహీన వర్గాలకు అన్యాయం చేయడం తగదని చెబుతున్నారు. ఈ అంశంపై రాజకీయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది. అధికార పార్టీ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

### సిగ్గుతో తలదించుకునేలా

## గురుకుల పాఠశాల పరిస్థితి

(మొదటిపేజీ తరువాయి)

డార్మెటరీలో బెడ్స్ విద్యార్థులు వాడుకోవడానికి వీలు లేని దారుణమైన స్థితిలో ఉన్నాయన్నారు. తీవ్ర దుర్గంధం వల్ల టాయ్ లెట్ల దగ్గరకు వెళ్లలేని దుస్థితి ఉందని.. ప్రిన్సిపాల్ కు తప్పదు కాబట్టి తనతో వచ్చారని, కేడర్ కూడా కలిసి రాలేనంత ఘోరంగా టాయ్ లెట్ల పరిసరాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్త పరిచారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితులు ఉండడం చాలా అవమానకరంగా ఉందన్నారు. నిద్రపోతున్న విద్యార్థులను ఎలుకలు కొరకడం అత్యంత బాధాకరమైన విషయంగా గంటా చెప్పారు. సిగ్గుతో తలదించుకునేలా ఉన్న గురుకుల పాఠశాల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కిచెన్, స్టోర్ కొంత పర్వాలేదని, ఎలుకల సమస్య పరిష్కారానికి చర్యలు మొదలుపెట్టారని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేస్తుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నా.. పిల్లల భవిష్యత్ బాగుండాలని 90 శాతం మంది పేద తల్లిదండ్రులు లక్షల ఫీజులు కట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల స్థాయి పెంచాలన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రతిష్టాత్మక గురుకుల పాఠశాలలో అసంపూర్తి భవనాలు.. డార్మెటరీ.. కిచెన్.. డైనింగ్ హాల్ తదితర సమస్యలను ఇప్పటికే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లానని, పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారని వివరించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పురుషోది, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కంటుభుక్త రామానాయుడు, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం నిరసన.. అధికారుల హామీతో విరమణ



**అనంతపురం, పతాకం న్యూస్:** రాయదుర్గం పట్టణంలోని మలకల్ మూర్ రోడ్డు ప్రాంతవాసులు శుక్రవారం ఖాళీ బిందెలతో రోడ్డు పైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. వేసవికాలం వారం రోజులైనా తాగునీరు సరఫరా చేయకపోవడంతో తాము ఎలా బతకాలని మున్సిపల్ ఇంజనీర్లు సురేష్, నరసింహులను నిలదీశారు. బోరు, టాంకర్ ఏర్పాటు చేసినప్పటికీ దానికి తాళం వేయడం వల్ల ఉపయోగంలో లేదన్నారు. కుళాయిలలో నీరు రాదని, ట్యాంకర్ కూడా సరఫరా చేయకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ట్యాంకర్ తో నీటిని సరఫరా చేస్తామని, బోరు బావికి తాళం వేయకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

## పేదలకు వరం షాదిఖానా

**కర్నూలు, పతాకం న్యూస్:** గ్రామంలో నూతనంగా నిర్వహించిన షాది ఖానా ముస్లిం పేదలకు వరంగా మారనుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాజీ రాజ్యసభ సభ్యులు టిజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం, ఈ.తాంద్రపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన షాదిఖానాను వారు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ ఎస్.బాలపీర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేడు వివాహాలు, శుభకార్యాలు ఖరీదైన తంతుగా మారాయన్నారు. అనేక ఏళ్లుగా గ్రామంలో షాది ఖానా లేకపోవడంతో వివాహాది శుభకార్యాల కోసం ముస్లిం సమాజం ఎంతో ఆర్థిక ఇబ్బందులు భారాలను మోయల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన షాది ఖానా గ్రామంలోని ముస్లింలకు వరంగా మారిందన్నారు. ముస్లిం లు ఈ అవకాశాన్ని సామూహికంగా వినియోగించు కోవాలన్నారు. గ్రామ సర్పంచ్ బాలపీర గ్రామ అభివఅద్ధి కోసం పాటుపడుతున్న తీరును వారు అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు గ్రామ ప్రజలకు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజా మియా మెహబూబ్ భాష, ఎంపిటిసి 1 బి .వెంకటేశ్వర్లు, ఎంపిటిసి 2, మెహబూబ్ భాష (లాయర్), పి. సిద్దయ్య, ఉస్మాన్ పి.బి ఉషనయ్య, పిఎండి మహమ్మద్ హుస్సేన్, అయ్యన్న, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజధాని చట్టబద్ధతతో విజయోత్సవ ర్యాలీ



**పి.గన్నవరం, పతాకం న్యూస్:** అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రివర్యులు లోకేష్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, నగరం ఎఎంసి ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, మండల టిడిపి అధ్యక్షురాలు పత్తిపాటి ఉమామహేశ్వరి, మట్టపర్తి బాలభారతి మరియు కూటమి నేతలు సంఘీభావం వ్యక్తం చేశారు. పి.గన్నవరం సెంటర్‌లో ఎంఎల్ఏ గిడ్డి సత్యనారాయణ ఆదేశాల మేరకు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పరిపాలన కోసం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు మద్దతుగా మనమంతా ఐక్యంగా నిలవాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. అమరావతి అభివృద్ధి రాష్ట్ర ప్రగతికి దారితీసే కీలక నిర్ణయమని పేర్కొంటూ ప్రజల్లో నూతన ఆశలు నింపారు.రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు అందించాలంటే అభివృద్ధి వికేంద్రీకరణతో పాటు బలమైన రాజధాని అవసరమని వివరించారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అభివృద్ధిని అడ్డుకున్న విధానం, అమరావతి వంటి కీలక అంశాలపై తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీశాయని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆశయాలను పట్టించుకోని విధంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని, రైతుల త్యాగాలను విస్మరించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేసారు. అమరావతి నిర్మాణం ద్వారా ఉద్యోగావకాశాలు పెరిగి, పెట్టుబడులు ఆకర్షితమై, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన గంగాభవాని, పి.గన్నవరం సొసైటీ ఛైర్ పర్సన్ సాధనాల వెంకట సత్యనారాయణ (జెడి), మట్టపర్తి రామకృష్ణ, కోటమి శ్రేణులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసీల భూములు జోలికొస్తే ఖబడ్దార్: సీపీఎం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఎత్తందార్లు ఆదివాసీ భూములు జోలికొస్తే ఖబడ్దార్ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కద్రక రామస్వామి హెచ్చరించారు. మండలంలోని రావికోన పంచాయతీ రంగాలగూడలో ఆ గ్రామ గిరిజనులతో మాట్లాడారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు నుంచి కొంతమంది పెత్తందారులు వచ్చి ఆదివాసీ భూములు తమ పేరున ఉన్నాయని, ఖాళీ చేయాలని, లేని పక్షంలో గ్రామాన్నిలేకుండా చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. అంతేకాక స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర అండదండగా ఉన్నారని, తాము ఏం చెప్పితే అదే చేస్తారని గ్రామస్తులను ఆదివాసీలను బెదిరిస్తున్నారని అన్నారు. 2007లో ఆదివాసీలు తమ అవసరాల కోసం కద్రక తమన్నా, కద్రక సీతన్న, కద్రక లచ్చన్న, కద్రక రామన్న, కుసుమూరు సూరమ్మ 12 ఎకరాల భూమి అమ్మితే కొండ నుండి ఊరు దిగువ వరకు 25 ఎకరాల భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకొని 19 ఏళ్ల తర్వాత తమ పేరున భూమి ఉంది కాబట్టి వెంటనే ఖాళీ చేయాలని బెదిరించడం సబబు కాదన్నారు. 2007లో గ్రామకంఠాన్ని పెత్తందారులు పేరున మార్చిన తర్వాత తమకు తెలిసి వెంటనే తహశీల్దార్ ఆఫీసులో విఆర్ఓకు విన్నవించుకోగా, గ్రామ కంఠాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. కాబట్టి అటువంటి పెత్తందారులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిక్ యాక్ట్ కింద నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని, ఆదివాసీల ప్రాణాలు కాపాడాలని, స్థానిక ఎమ్మెల్యే ఆదివాసీల పక్షాన ఉంటారో పెత్తందారులు పక్షం ఉంటారో తెల్చుకోవాలని కోరారు. ఈ సమస్యపై ఈనెల 6న కలెక్టరేట్‌లో ఈ సమస్యలపై భారీ ఎత్తున ఆందోళన ఉందని, అన్ని గిరిజన గ్రామాలు నుంచి కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాము, హెచ్.బలరాం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మీ పిల్లలు ఆటిజంతో బాధపడుతున్నారా?

పేరు పెట్టి పిలిచినా పలకకపోవడం, ఐ కాంటాక్ట్ సరిగా లేకపోవడం, వారి వంక చూసి నవ్వినప్పుడు తిరిగి నవ్వకపోవడం వంటి లక్షణాలు ఆటిజం(మంద బుద్ధి) సమస్య ఉన్న పిల్లల్లో కనిపిస్తుంటాయి. పిల్లల్లో వయసుకు తగ్గట్టు మానసిక ఎదుగుదల లేకపోతే దాన్ని 'ఆటిజమ్' అంటారు. ఇదొక నాడీ సంబంధ రుగ్మత అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఆటిజం లక్షణాలు ఏంటి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచంలోని ప్రతి 68 మంది చిన్నారుల్లో ఒకరు ఆటిజం సమస్యతో బాధపడుతున్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఎదుటివారి మాటల్నీ, హావభావాల్నీ అర్థం చేసుకోకపోవడం, మేధోవికాసం లేకపోవడం, చేసిన పనిని పదే పదే చేయడం, మాటలు మాట్లాడటంలో తడబాటు, ఉద్వేగాల్ని అదుపుచేయలేకపోవడం ఇలా అనేక సమస్యల్ని కలిపే ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అంటారని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అర్థం చేసుకొని తగినంత ప్రోత్సాహం ఇస్తే ఆటిజమ్ పిల్లలు చాలా వరకు దీని నుంచి బయటపడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఈ సమస్య ఆడపిల్లల్లో కన్నా మగపిల్లలకు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా, తల్లిదండ్రులు చాలా ఆలస్యంగా సంతానాన్ని కనటం, కాన్పు సమయంలో మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవటం వంటి సమస్యలు ఎదుర్కొన్న వారికి దీని ముప్పు ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.



ఆటిజమ్‌ను నిర్ధారించటానికి ఎలాంటి పరీక్షలు లేవని, దీన్ని లక్షణాలతో మాత్రమే గుర్తిస్తారంటున్నారు నిపుణులు. బాల్యంలో ప్రవర్తన, ఎదుగులలో మార్పులు వంటివి సమస్యను గుర్తించటానికి తోడ్పడతాయని చెబుతున్నారు. ఆటిజమ్‌తో బాధపడే పిల్లలు తొమ్మిది నెలల వయసు వచ్చినా తమ పేరుకు స్పందించకపోవచ్చని తెలియజేస్తున్నారు. మూడేళ్ల వయసు వచ్చినా ఇతర పిల్లలతో కలవటానికి అంతగా ఇష్టపడరని వివరిస్తున్నారు. ఐదేళ్ల వయసుకు చేరుకున్నా ముఖంలో బాధ, సంతోషం వంటి భావాలనూ అంతగా ప్రదర్శించకపోవచ్చని వెల్లడిస్తున్నారు. కానీ, ఇలాంటి లక్షణాలను తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకుండా, వారిని మరీ గారాబం చేస్తుంటారని చెబుతున్నారు. ఇలాంటి కీలకమైన ఎదుగుదల దశలో నిపుణుల సలహా తీసుకోవటం చాలా అవసరమంటున్నారు.. కొంత మంది పిల్లలు అతి చురుకుగానూ స్పందించవచ్చని, మరికొందరికి కుంగుబాటు, ఆందోళన వంటివీ ఉంచొచ్చని తెలియజేస్తున్నారు. వీటికి తగు చికిత్స ఇప్పించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆటిజం స్పెక్ట్రమ్ రుగ్మతకు చికిత్స లేదని, కానీ ప్రీస్కూల్ సంవత్సరాల్లోనే చికిత్స పొందడం వల్ల ఈ పరిస్థితి ఉన్న చాలా మంది పిల్లల జీవితాల్లో పెద్ద మార్పు వస్తుందని అధ్యయనం పేర్కొంది. ప్రతి ఒక్కరికి వారి లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ లాంటి చికిత్స ఉంటాయని, ఆయా చికిత్సల ద్వారా కచ్చితంగా మెరుగుదల కనిపిస్తుందని %షెసఎ.స్త్ర.శీజ% అధ్యయనం పేర్కొంది. కానీ, తల్లిదండ్రులే శిక్షకులుగా మారాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోలుస్తుంటారు. వారిలాగా ఉండమని తమ పిల్లలకు చెబుతుంటారు. కానీ, ఇలా చేయడం వల్ల ఆటిజమ్ సమస్యలు తగ్గుతాయని అనుకుంటారు. అయితే, ఈ పద్ధతి ఏ మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. అలాగే, ఆటిజం ఉన్న వారిలో కూడా ఎన్నో నైపుణ్యాలు ఉంటాయని చెబుతున్నారు. ఎందుకంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దాన్ని గుర్తించి అందుకు తగ్గ తోడ్పటు అందించాలని సూచిస్తున్నారు. ఆటిజమ్ పిల్లలు పెద్దయ్యాక ఎలా ఉంటారన్నది తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, తోటి పిల్లల నుంచి లభించే ప్రోత్సాహాన్ని బట్టి ఆధారపడి ఉంటుందంటున్నారు నిపుణులు. కొందరు కొన్ని విషయాల్లో బాగా రాణిస్తుంటారని చెబుతున్నారు. సంగీతం, కంప్యూటర్లు, బొమ్మలు వేయుటం వంటి వాటిపై ఎనలేని నైపుణ్యం ఉంటుందని పేర్కొంటున్నారు. అందువల్ల వీరిలో దాగిన నైపుణ్యాన్ని వెలికి తీయటానికి, మరింత సాన బెట్టటానికి ప్రయత్నం చేయాలని తెలియజేస్తున్నారు. ఆటిజమ్ పిల్లల్లో సమన్వయం, ఏకాగ్రత పెరగటానికి ఆటలు బాగా తోడ్పడతాయంటున్నారు నిపుణులు. వ్యక్తిగతంగా ఆడే పరుగు, ఈత వంటి ఆటలు మేలని చెబుతున్నారు. ఎందుకంటే వీటిల్లో ఇతరులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని, గెలిచామనే సంతోషమూ కలుగుతుందని వివరిస్తున్నారు. అదే పుట్?బాల్, క్రికెట్, బాస్కెట్?బాల్ వంటి ఆటలైతే ఎక్కువ మందితో కలిసి, ఆయా సందర్భాలకు అనుగుణంగా ఆడాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. మొదట్లో వీళ్లు ఆటటానికి వెనకాడొచ్చని, కానీ తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించాలని చెబుతున్నారు.

# కేజి బేసిన్ గ్యాస్‌లో సగం రాష్ట్రానికివ్వాలి

## సీపీఎం రౌండ్‌టేబుల్‌లో వక్తల డిమాండ్



**అమరావతి, పతాకం న్యూస్:** కృష్ణా - గోదావరి (కెజి) బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువులో రాష్ట్ర అవసరాలకు సగం కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యాన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు చెందాల్సిన సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది. ప్రధాన తీర్మానాన్ని శ్రీనివాసరావు ప్రవేశపెట్టి మాట్లాడారు. రాష్ట్ర వనరులను అంబానీ, అదాని దోచుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రంలో ఉండే సహజవనరులు ఆ రాష్ట్రప్రభుత్వాలకే హక్కు ఉంటుందని 12వ కేంద్ర ఆర్థిక కమిషన్ తెలిపిందన్నారు. రాష్ట్రంలో గ్యాస్ ఉత్పత్తి అవుతున్నా, అది అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇక్కడి సహజ వాయువును మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలతో పాటు విదేశాలకు తరలిస్తూ కోట్ల రూపాయల లాభం కార్పొరేట్ కంపెనీలు సంపాదిస్తున్నాయని తెలిపారు. కెజి బేసిన్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా అందిస్తే చాలా చౌకగా ప్రజలకు అందించవచ్చునని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిపై చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే రిలయన్స్‌కు కేటాయించిన డి6 బ్లాక్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక కమిషన్ నిర్ణయం ప్రకారం 50శాతం గ్యాస్ రాష్ట్రానికి న్యాయబద్ధంగా అప్పగించాలని, లేదంటే ఈ బేసిన్‌ను జాతీయం చేయాలని డిమాండ్ చేశారు. సంక్షోభం సమయంలోనైనా ఈ అంశంపై దృష్టి సారించి రాష్ట్రానికి రావాల్సిన హక్కులను రాబట్టుకోవాలని కోరారు. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించి 'మన గ్యాస్ మన హక్కు' నినాదంతో పోరాడాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కష్టాలు, నష్టాలు ప్రజలకు అందిస్తూ ప్రయోజనాలను కార్పొరేట్ కంపెనీలకు అందిస్తున్నాయని విమర్శించారు. దీనిని చూస్తూ ఊరుకోవడం రాష్ట్రప్రభుత్వానికి ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని, పోలవరం అంశాల చుట్టూ తిప్పుతున్నారే తప్ప రాష్ట్ర సమగ్రాభివృద్ధి ఎలా జరగాలనే చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో దొరుకుతున్న చమురు, సహజ వాయువులను ఎలా పొందాలి, వాటి హక్కులను ఎలా కాపాడుకోవాలనే ఆలోచన చేయడం లేదన్నారు. కెజి బేసిన్‌పై జనవిజ్ఞాన వేదిక గతంలో ప్రచురించిన పుస్తకాన్ని తాజాపర్చి మరలా ప్రచురించి ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రానికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా వచ్చిన గ్యాస్ కొరతను తీర్చేందుకు ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చిందన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ సహజ సంపద ప్రజలకు చెందకుండా దోపిడీకి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాపై రాష్ట్రప్రభుత్వం నోరుమెదపడం లేదని, హక్కులపై ఐక్యంగా పోరాటం చేసి సాధించుకోవాలని తెలిపారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి ప్రసాద్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరనాథ్, సిపిఎం (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ, ఎంసిపిఐ (యు) నాయకులు ఖాదర్ బాషా మాట్లాడుతూ కెజి బేసిన్‌లో వాటా కోసం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్నా కూడా ఈ అంశంపై నోరుమెదపడం లేదని విమర్శించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ నాయకులు ఎం వెంకటరెడ్డి, ఐఎఫ్‌టియు నాయకులు పోలారి, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినరు కుమార్, ప్రొఫెసర్ రాజమోహన్, ఎఐకెఎంఎస్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ కెజి బేసిన్ వల్ల ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు డి రమాదేవి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, వృత్తిదారుల సంఘం నాయకులు వెంకట్, అరుణోదయ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ కెజి బేసిన్ గ్యాస్ కోల్పోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు వివరించాలని, ప్రజా ఉద్యమం దిశగా తీసుకెళ్లేందుకు విస్తృత స్థాయిలో దీనిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, గిరిజన సంఘం నాయకులు అశోక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్, పిడిఎస్‌యు నాయకులు రాజేష్ ప్రసంగించి వారి మద్దతు తెలిపారు.

# హర్మూజ్‌ను తెరిచేందుకు బ్రిటన్ ప్రయత్నాలు... భారత్ సహా 40 దేశాలకు ఆహ్వానం



**ఇరాన్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి సుమారు 40 దేశాలతో చర్చిస్తున్నట్లు బ్రిటన్ వెల్లడించింది. ఈ జలసంధిని తెరవడానికి బ్రిటన్ నేతృత్వంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం ఆ దేశం పలు దేశాలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 40 దేశాలను ఆహ్వానించింది. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. భారత్ తరఫున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇందులో వర్చువల్‌గా పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సమావేశంలో అమెరికా పాల్గొనడం లేదు. హర్మూజ్ జలసంధిని తెరవడానికి ప్రపంచ దేశాలు ప్రయత్నించాలని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిటన్ స్పందించింది. భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, యూఏఈ సహా 40 దేశాలు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొననున్నాయి. వచ్చే వారం ఈ సమావేశం ఉండనుంది. ఈ సమావేశానికి బ్రిటన్ విదేశాంగ మంత్రి కూపర్ అధ్యక్షత వహించనున్నారు. ఇరాన్ వైఖరి ప్రపంచ ఆర్థిక భద్రతను దెబ్బతీస్తోందని కూపర్ ఆందోళన వ్యక్తం చేశారు.అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది.




# సంజు శాంసన్‌పై మోడీ ప్రశంసలు





టీమిండియా స్టార్ బ్యాటర్, కేరళ ఆటగాడు సంజూ శాంసన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ కనబరిచిన అద్భుతమైన ఆటతీరును ఆయన కొనియాడారు. కేరళ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల అమోఘమని అన్నారు. జట్టుకు అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేసేవాడే నిజమైన ఆటగాడని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తోంది. కేరళ ప్రజలు కూడా సంజూ శాంసన్ ప్రదర్శన నుంచి నేర్చుకోవాలి. ప్రపంచకప్‌లో శాంసన్ ఆటతీరును మనం చూశాం. టోర్నమెంట్‌లో కీలకమైన నాకౌట్ దశ వచ్చినప్పుడు, అతని ప్రదర్శన అకస్మాత్తుగా శిఖర స్థాయికి చేరింది. టోర్నీ ఆరంభం నుంచి ముగింపు వరకు అతని ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతూనే ఉన్నాయి. జట్టుకు అతని అవసరం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఇదే నిజమైన ఆటగాడికి ఉండాల్సిన లక్షణం" అని తెలిపారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో 80.25 సగటు, 199.37 స్ట్రైక్ రేట్‌తో 321 పరుగులు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్" అవార్డును గెలుచుకున్నాడు. ఇందులో 27 ఫోర్లు, 24 సిక్సులు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ (2014లో 319 పరుగులు) రికార్డును శాంసన్ అధిగమించాడు. టోర్నీ ఆరంభంలో రెండు మ్యాచ్‌లలో పెద్దగా రాణించకపోయినా, సూపర్-8 దశ నుంచి శాంసన్ చెలరేగిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అజేయంగా 97 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై మరో 89 పరుగులతో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.

# సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తొలి విజయం



ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధిం చింది. తొలుత ఓపెనర్లు అభిషేక్ శర్మ(48; 21బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు), హెడ్(46; 21బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు క్లాసెన్(52) అర్ధసెంచరీతో రాణించడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీస్కోర్ చేసింది. అనంతరం కోల్‌కతా నైట్‌రైడర్స్ పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి 74 పరుగులు చేసి గెలుపుపై ఆశలు రేపినా.. ఆ తర్వాత సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 161 పరుగులకే కుప్పకూలింది. కోల్‌కతా బ్యాటర్లు రఘువంశీ(52), రింకు సింగ్(35), అలెన్(28) మాత్రమే రాణించగా.. కెప్టెన్ రహానే(8), గ్రీన్(2), అనుకుల్ రారు(2)కి తోడు లోయర్ ఆర్డర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సన్‌రైజర్స్ బౌలర్లు ఉనాద్కట్‌కు మూడు, ఈషన్ మలింగ, నితీశ్‌కుమార్ రెడ్డికి రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు సన్‌రైజర్స్ పవర్ ప్లే 6 ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ జట్టు వికెట్ నష్టానికి 84పరుగులు చేయగా.. ఆ తర్వాత కోల్‌కతా ఓపెనర్లు అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ట్రెవిస్ హెడ్ (21 బంతుల్లో 46; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (14) అదే జోరును కొనసాగించే క్రమంలో ఔటయ్యాడు. అనికేత్ వర్మ ఒక్క పరుగుకే ఔటై నిరాశపరిచాడు. ఆ తర్వాత క్లాసెన్(52; 35బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్)కి తోడు నితీశ్ కుమార్ రెడ్డి (39) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లు ముజరబ్బానికి నాలుగు, వైభవ్ అరోరాకు రెండు, కార్తీక్ త్యాగీ, అనుకుల్ రారుకు ఒక్కో వికెట్ దక్కాయి.

సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఖాతాలో మరో భారీ చేరింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 4సిక్సర్లు బాదిన అభిషేక్.. సిక్సర్ల సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. దీంతో ఎస్ఆర్‌హెచ్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. అతనికంటే ముందు డేవిడ్ వార్నర్ సన్‌రైజర్స్ తరఫున 143 సిక్సర్లు బాదాడు. ఎస్ఆర్‌హెచ్ తరఫున అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో వార్నర్, అభిషేక్ తర్వాతి స్థానాల్లో క్లాసెన్ (89), కేన్ విలియమ్సన్ (64), ట్రవిస్ హెడ్ (50) ఉన్నారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి)గ్రీన్ (బి)కార్తీక్ త్యాగి 46, అభిషేక్ శర్మ (సి)వరుణ్ చక్రవర్తి (బి)ముజరబ్బాని 48, ఇషాన్ కిషన్ (సి)రింకు సింగ్ (బి)ముజరబ్బాని 14, క్లాసెన్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)ముజరబ్బాని 52, అనికేత్ వర్మ (సి)రింకు సింగ్ (బి)అనుకుల్ రారు 1, నితీశ్ కుమార్ రెడ్డి (సి)వరుణ్ చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 39, సలీల్ అరోరా (బి)వైభవ్ అరోరా 0, హర్ష్ దూబే (నాటౌట్) 9.




# 'రాకాస'

## మూవీ రివ్యూ



సినిమాలు జనాదరణ పొందాలంటే ఎంచుకునే కథాంశంలో కొత్తదనంతో పాటు ఇంట్రెస్టింగ్ జోనర్ కూడా ముఖ్యం. అలాంటి ఇంట్రెస్టింగ్ జోనర్‌ల్లో ఒకటి హారర్ కామెడీ. ఇలాంటి నేపథ్య కథకు ఫాంటసీ అంశాలను కూడా జోడించి నిర్మించిన చిత్రం 'రాకాస'. సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన 'రాకాస' ప్రేక్షకులను భయపెట్టిందా? ఈ చిత్రం ప్రేక్షకులకు ఎలాంటి వినోదాన్ని పంచింది? అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం. ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుందామని అమెరికా నుంచి సొంత గ్రామానికి తిరిగొస్తాడు ఈరబాబు అలియాస్ వీరు (సంగీత్ శోభన్). కానీ తను ప్రేమించిన అమ్మాయి వేరొకరిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైందని తెలుసుకున్న ఈరబాబు ఎలాగైనా ఆ పెళ్లిని ఆపాలని స్నేహితుడు బాలు (గెటప్ శీను)తో కలిసి ప్లాన్ చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఆ ఊరిలోనే ఉంటున్న సుబ్బలక్ష్మి (నయన సారిక)ను కలుస్తాడు. ఇక అనుకోకుండా ఈ ఇద్దరి మధ్య ప్రేమ పుడుతుంది. పూర్వీకుల కాలం నుంచి ఊరికి ఉన్న శాపం ప్రకారం ఊరి కోటలో ఉండే రాక్షసుడు నరబలి కోరడం జరగుతుండేది. ఇందుకు వచ్చే మూడు హెచ్చరికల తరువాత నరబలికి సిద్ధమయ్యే పేరును ఊరి పెద్దలు ఖరారు చేస్తారు. ఆ వ్యక్తిని కోటలోకి పంపితే ఊరి సుభిక్షంగా ఉంటుందనేది వారి నమ్మకం. లేకపోతే ఊరంతా నాశనమవుతుందని భయపడుతుంటారు. అయితే కొన్ని కారణాల వల్ల ఊరి కోటలోకి ఈరబాబు వెళ్లాల్సి వస్తుంది. మరి కోటలోకి వెళ్లిన వీరబాబు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు? కోటలోకి వెళ్లిన ఆయన తిరిగొచ్చాడా? ఈరబాబు కోసం కోటలోకి వెళ్లిన బాలు, సుబ్బలక్ష్మిలు ఏం చేశారు? అసలు కోటలో ఉన్న రాక్షసుడు ఎవరు? ఇలాంటి అన్ని విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. సాధారణంగా హారర్ కామెడీ సినిమాలు అంటే.. ఒక కోట, అందులో ఆత్మలు, దెయ్యాలు, రాక్షసులు, హీరో, అతని స్నేహ బృందం అనుకోకుండా ఆ కోటకు వెళ్లడం.. అక్కడ చిక్కుకోవడం, హీరో బృందం చేసే కామెడీ.. ఓ చిన్న ట్విస్ట్‌తో ఇంటర్వెల్ బ్యాంగ్... చివర్లో రాక్షసుడిని అంతం చేసి కోట నుంచి సురక్షితంగా బయటపడటం.. ఇలాంటి నేపథ్యంతోనే సినిమాలు వస్తుంటాయి. ఇక 'రాక్షస' కూడా అచ్చంగా ఇలాంటి కథాంశంతోనే వచ్చింది. అయితే ఈ హారర్ కామెడీ కాస్త ఫాంటసీ అంశాలు జోడించారు. అయితే అన్ని హారర్ కామెడీ చిత్రాల తరహాలో ఈ చిత్రంలో ప్రేక్షకులను భయపెట్టే ప్రయత్నం చేయలేదు. ఫాంటసీ అంశాలతో అలరించే ప్రయత్నం చేశారు మేకర్స్. అయితే ఇలాంటి సినిమాకు భయపెడుతూనే వినోదంతో అలరించడం ఎంతో ముఖ్యం. ఈ సినిమా ఈ రెండు అంశాల్లో విఫలమైందని చెప్పాలి. సెకండాఫ్‌లో అక్కడక్కడా కొన్ని సన్నివేశాల్లో మినహా హాస్యం పండలేదు. ఆడియన్స్‌ను పెద్దగా భయపెట్టే సన్నివేశాలు, థ్రిల్‌ను పంచే సీన్స్ కూడా కనిపించవు. ఫస్ట్‌హాఫ్‌లో హీరో అమెరికా నుంచి తిరిగిరావడం, హీరోని పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయి వేరొకరిని పెళ్లి చేసుకునే సన్నివేశాలు మినహా ఎక్కడా కూడా ఏ సన్నివేశం కూడా కామెడీని జనరేట్ చెయ్యవు. ద్వితీయార్థంలో హీరో కోటలోకి వెళ్లినప్పుడైనా హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుందని ఆశించిన ఆడియన్స్ అక్కడక్కడా నవ్వుకుంటూ సంతృప్తిపడాల్సి వస్తుంది. పతాక సన్నివేశాలు, అందులో భాగంగా రాక్షసుడు, హీరో, హీరో బృందం మధ్య వచ్చే సీన్స్ మాత్రం ఎంగేజింగ్‌గా ఉంటాయి. ద్వితీయార్థం తరహాలోనే ఇంటర్వెల్‌కు ముందు భాగంలో కూడా సరైన ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి ఉంటే సినిమా ఫలితం మరోలా ఉండేది. ఈ చిత్రబృందం ప్రమోషన్స్‌తో తెచ్చిన బజ్‌కు తగిన అంచనాలకు సరిపోయే విధంగా ఈ చిత్ర కథాంశం, కంటెంట్ లేకపోవడం ఈ చిత్రానికి మైనస్‌గా మారింది. ఓవరాల్‌గా అక్కడక్కడ నవ్విస్తూ, భయపెడుతూ 'రాకాస' ఆడియన్స్‌కు పూర్తిస్థాయి వినోదాన్ని మాత్రం అందించలేక పోయింది. మ్యాడ్, మ్యాడ్-2 చిత్రాల్లో పూర్తి స్థాయి కామెడీ పాత్రలో నటించిన సంగీత్ శోభన్ ఈ సినిమాలో కాస్త విభిన్నమైన పాత్రలో కనిపించాడు. ఈరబాబు పాత్రలో తనదైన ఎనర్జీతో అలరించాడు. అయితే సన్నివేశాల్లో కామెడీ లేకపోవడంతో తనదైన నటనతో అలరించే ప్రయత్నం చేశాడు. గెటప్ శ్రీను, వెన్నెల కిషోర్, నయన సారిక అక్కడడక్కడా నవ్వించారు. వెన్నల కిషోర్ పాత్ర కూడా నవ్వించే ప్రయత్నం చేసినా, ఫలించలేదు. బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, రోహన్ రాయ్‌లు ఈ చిత్రంలో నటించారు. పాటలు, నేపథ్య సంగీతం ఫర్వాలేదు. దర్శకురాలిగా మానస శర్మ తను అనుకున్న సన్నివేశాలు ప్రజెంట్ చేయగలిగినా, రచనా పరంగా మరింత శ్రద్ధ పెట్టి ఉంటే ఆ సన్నివేశాలు బలంగా కనిపించేవి. కథకు తగిన విధంగా నిర్మాణ విలువలు ఉన్నాయి. ఓ డిఫరెంట్ ఎటెంప్ట్ చేయాలన్న నిర్మాత అభిరుచికి, బలమైన రచనా బృందం తోడైతే ఈ సినిమా ఫలితం మరో స్థాయిలో ఉండేది. హారర్ కామెడీ జోనర్, ఫాంటసీ సినిమాలను ఇష్టపడే వారికి 'రాకాస' అక్కడక్కడా నవ్విస్తూ.. భయపెడుతూ.. అలరిస్తుంది. ఇంట్రెస్టింగ్ జోనర్‌తో వచ్చిన ఈ సినిమాకు, ఆడియన్స్‌లో మంచి బజ్ కూడా తోడవ్వడంతో ఈ వీకెండ్ బాక్సాఫీస్ కలెక్షన్లు మాత్రం ఆశాజనకంగానే ఉంటాయి.

# నేడు 'డెకాయిట్' ట్రైలర్ విడుదల



కథానాయకుడు అడివి శేష్ నటించిన 'డెకాయిట్?' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. షనీల్ డియో దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్‌కు జోడీగా మృణాల్ ఠాగూర్ నటించారు. ఈనెల 4న ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లుగా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్‌మీడియా ద్వారా ముచ్చటిస్తూ వెల్లడించారు. ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రకాష్‌రాజ్, అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం.




# ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు: సంయుక్త మీనన్



మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్.

బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది.

"ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది. భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది.

వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**